# Key Area 4 : Building & leading teams

## ప్రధాన రంగం : బృంద నిర్మాణం మరియు నాయకత్వం

**మాడ్యూల్ పేరు** : జట్టు నిర్మాణము (Team Building)


**రచయిత** :

1. డా. కె. రవికాంత్ రావు, DEO,
   సిద్ధిపేట్ జిల్లా.
   Cell No : 7995087610
2. తాళ్ళపల్లి రమేశ్, సెక్టోరల్ అధికారి–II,
   జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం,
   సిద్ధిపేట. Cell No : 9908557460

e–mail : deosiddipet@gmail.com

# జట్టు నిర్మాణము (Team Building)

## ఉపోద్ఘాతం (Introduction):

పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు, ప్రత్యేక అధికారులు, మనం ఏ పేరుతో పిలిచినా పాఠశాల రథసారథులుగా జట్టు నిర్మాతలుగా పనిచేస్తున్నారు. వనరులు ఎంత తక్కువగా ఉన్నప్పటికి, అవరోధాలు ఎన్ని ఉన్నప్పటికినీ ఉపాధ్యాయ బృందాన్ని చక్కగా సమన్వయపరుస్తూ జట్టు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేసే విధంగా ఎలా చేయవచ్చునో ఈ మాడ్యూల్ లో చర్చించటం జరిగింది. సంక్షిప్తంగా జట్టు అంటే ఏమిటి? జట్టు పని మరియు జట్టు నిర్మాణము ఎలా జరుగుతుంది? సమూహం అంటే ఏమిటి? సమూహానికి జట్టుకు గల సారూప్యతలు, వ్యత్యాసాలు ఏమిటి? మనం ఎందుకు జట్టుగా ఏర్పడాలి? ఒక జట్టు ఎలా అత్యుత్తమంగా పని చేయగలుగుతుంది? జట్టు పని నైపుణ్యాలు ఏవి? చక్కని విజయవంతమైన జట్టుగా తీర్చిదిద్దటానికి రథసారథి ఏం చేయాలి? మరియు జట్టు సభ్యులు ఎలా నడుచుకోవాలి? ప్రభావవంతమైన జట్టు లక్షణాలు ఏమిటి? జట్టు నిర్మాణ నియమాలు ఏమిటి? మొదలగు అంశాలను ఉదాహరణలతో చర్చిద్దాం.

## అభ్యసన లక్ష్యాలు (Learning objectives):

ఈ మాడ్యూల్ ఈ క్రింది లక్ష్యాలు దృష్టిలో ఉంచుకుని తయారు చేయడం జరిగింది.

- జట్టు నిర్మాణము – జట్టు, సమూహము మధ్యగల భేదాలు తెలిసికొనగలుగుతారు.
- జట్టు రథసారధి సభ్యులు బాధ్యతలు విధులు పంచుకోవటం తెలుసుకోగలుగుతారు.
- జట్టుగా ఏర్పడటం వలన కలిగే లాభాలు జట్టు పని నైపుణ్యాలు తెలుసుకోగలుగుతారు.
- చక్కని విజయవంతమైన జట్టుగా తీర్చిదిద్దడానికి ప్రభావవంతమైన జట్టుగా మలచటానికి తీసుకోవలసిన చర్యలు తెలుసుకుంటారు.
- జట్టు నియమాలను అవగతం చేసుకుంటారు.

## కీలకమైన పదాలు (Key Words) :

జట్టు, సమూహం, జట్టు నైపుణ్యాలు, ప్రభావవంతమైన జట్టు, జట్టు నియమాలు

## జట్టు అంటే ఏమిటి? (What is a Team?) :

జట్టు అర్థం తెలుసుకోవడానికి ముందుగా సమూహం అంటే ఏమిటి అని అర్థం చేసుకోవాలి. కొందరు వ్యక్తుల గుంపును సమూహంగా భావించవచ్చు. మన సమాజంలో అనేక సమూహాలు కనిపిస్తాయి. జట్టు సమూహం రెండు పదాలు ఒకే అర్థం వచ్చేలా ఉన్నప్పటికీ మౌలికంగా రెండింటి ఉద్దేశాలు వేరువేరుగా ఉంటాయి. జట్టు మరియు సమూహంలోని సభ్యుల మధ్య పరస్పర సహకారం ఉంటుంది. సభ్యులు ఒకరినొకరు

సహకరించుకుంటూ ఉంటారు. సమూహంలోని సభ్యులకు ఒక ప్రత్యేక ఉమ్మడి లక్ష్యం అనేది నిర్దేశించబడి ఉండదు. కాని జట్టులోని అందరు సభ్యులు ప్రత్యేకమైన లక్ష్యాన్ని సాధించటానికి నిరంతరం కృషి చేస్తూ ఉంటారు. ప్రతి సమూహానికి నిర్దిష్టమైన నాయకత్వం అవసరం లేదు కాని జట్టుకు మాత్రము నిర్దిష్టమైన రథసారధి ఉండాలి. జట్టు యొక్క లక్ష్యాలను స్పష్టంగా, అర్థవంతంగా, ఆచరణలో సాధ్యమయ్యే వాటిని ఎంపిక చేసుకోగలగాలి. ఆయా లక్ష్యాల సాధనకు జట్టు సభ్యులు ఎలా పనిచేయాలో అందుకు అనుగుణంగా బాధ్యతలను పంపిణీ చేయాలి. వారి యొక్క అర్హతలు అనుభవం, ఇష్టాయిష్టాలను పరిగణనలోకి తీసుకొని బాధ్యతలను పంపిణీ చేయడం ద్వారా జట్టు లక్ష్యసిద్ధికి చేరువులో ఉండడానికి అవకాశాలు హెచ్చు.

జట్టు సభ్యుల ఎంపిక కూడా ముఖ్యమే అయినప్పటికీ మనకున్న పాఠశాల వ్యవస్థలో ఎంపిక అనేది సాధ్యం కాదు. కావున జట్టు సారథి (ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ , ప్రత్యేక అధికారిణి) మరియు ఉపాధ్యాయ బృందం సాధించవలసిన లక్ష్యాలు వాటి ఆవశ్యకతలను తనకు అందుబాటులో ఉన్న వనరులను తద్వారా చేయవలసిన కృషిని వారికి అర్థం అయ్యే విధంగా తెలియజేసి అందరి సహాయ సహకారాలను అర్థించి చక్కటి పటిష్టమైన జట్టు నిర్మాణం గావించాలి.

## జట్టుగా ఎందుకు ఏర్పడాలి? (Why a Team has to be formed?):

ఒక వ్యక్తి ఏమిసాధించలేకపోవచ్చు, కానీ జట్టు సభ్యులందరి సహాయ సహకారాలతో అద్భుతాలు సాధించవచ్చు. పరిమిత వనరులను ఉపయోగించుకుని తక్కువ కాలంలో లక్ష్యాలను, ఉత్తమ ఫలితాలను సాధించవచ్చును. జట్టు సభ్యుల కృషి వలననే సమాజంలో పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు లభించటంతో పాటుగా విద్యార్థుల తల్లిదండ్రుల, సమాజం యొక్క ఆదరణ, అభిమానాలను చూరగొనవచ్చును. ఒక వ్యక్తి యొక్క శక్తి విడిగా చాలా తక్కువ కానీ సభ్యులందరూ కలిస్తే ఆ శక్తి ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది, తద్వారా అత్యుత్తమ ఫలితాలను సాధించవచ్చు.

## ఇక్కడ ఒక పాఠశాలలో జట్టు నిర్మాణాన్ని పరిశీలిద్దాం:

సిద్దిపేట జిల్లాలో అత్యధిక విద్యార్థులు చదువుతున్న పాఠశాల జట్టు పనిని చూద్దాం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరా నగర్, సిద్దిపేట పట్టణములో (1007) మంది విద్యార్థులు చదువుచున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు (17) మంది ఉపాధ్యాయ బృందం ఒక జట్టుగా ఏర్పడి పాఠశాల నిర్వహణ మరియు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగున్నది. ఇందుకోసం వారు (5) రకాల కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. అవి

1. అకడమిక్ కమిటీ, 2. క్రమశిక్షణ కమిటీ, 3. సాంస్కృతిక కమిటీ,
4. క్రీడలు మరియు ఆటల నిర్వహణ కమిటీ, మరియు 5. సామాజిక కార్యక్రమాల కమిటీ.

ఒక్కొక్క కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. వారిలో ఒక్కరు జట్టు నాయకుడుగా వ్యవహరిస్తారు. ఈ జట్టు నాయకులు ప్రధానోపాధ్యాయులు అందించిన సమాచారాన్ని తోటి సభ్యులతో చర్చించి ప్రణాళికలు, కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ విధంగా పాఠశాలలో అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. తద్వారా అత్యుత్తమ ఫలితాలతో పాటుగా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంతో పాటుగా సమగ్ర అభ్యున్నతికి దోహద పడుతున్నారు.

**ఇప్పుడు మనం ఒక్కొక్క కమిటీ వారు నిర్వహించే విధులను తెలుసుకుందాము.**

1. **అకడమిక్ కమిటీ**:
    - విద్యార్థుల నోటు పుస్తకాలను, అసైన్ మెంట్ రికార్డులను షెడ్యూలు ప్రకారం పరిశీలించటం.
    - పాఠ్యపుస్తకాలు, గ్రంధాలయ పుస్తకాలు తరగతి వారీగా పంపిణీ చేయటం.
    - బోధనాభ్యాసన సామాగ్రి, స్టేషనరీ వస్తువులు అందించుట.
    - ఆయా తరగతులకు అవసరమైన చార్టులు, ప్రదర్శన సామాగ్రిని విద్యార్థుల చేత తయారు చేయించుట ప్రదర్శించుట.
2. **క్రమశిక్షణా కమిటీ**:
    - విద్యార్థుల హాజరును పర్యవేక్షించి పాఠశాలలో విద్యార్థులందరూ క్రమశిక్షణతో నడుచుకునే విధంగా చూడటం విద్యార్థులలో అభిలషణీయమైన ప్రవర్తనా మార్పులు తీసుకురావడం.
3. **సాంస్కృతిక కమిటీ**:
    - ప్రతి విద్యార్థి తన కిష్టమైన తనకు ప్రాథమిక పరిజ్ఞానం ఉన్న సాంస్కృతిక అంశాల్లో పాల్గొనే అవకాశం కల్పించుట.
    - వివిధ రకాల కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో ఉత్తమ విలువలను పెంపొందించడం.
4. **క్రీడలు – ఆటల నిర్వహణ కమిటీ**:
    - విద్యార్థుల్లో శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుట.
    - యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామ మొదలగు వాటిని అభ్యాసం చేయటం ద్వారా శక్తియుక్తులు పెంపొందించుట.
    - క్రీడలు ఇతర అంశాలైన కరాటే, కుంగ్ ఫూ మొదలగు వాటిలో శిక్షణ ఇప్పించుట.

5. **సామాజిక సంబంధాల కమిటీ**:

- విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల నిర్వహణ.
- సహ విద్యార్థులతో సత్సంబంధాలు నెలకొల్పే విధంగా కార్యక్రమాల నిర్వహణ.
- సమాజ కార్యక్రమాల్లో భాగస్వామ్యం, సామాజిక సర్దుబాటు కలిగి ఉండే విధంగా కృషి చేయటం.
- సమాజంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన వ్యక్తులను పాఠశాలకు రప్పించి విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించటం.

ఆయా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ ఐదు కమిటీలు నిరంతరం పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులకు తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తాయి. ఏ విధమైన సమస్యలు లేకుండా పాఠశాల నిర్వహణ చక్కగా జరుగుతుంది.

## జట్టు నిర్మాణం వలన ఇందిరానగర్ పాఠశాల మీద ప్రభావం

(Impact of Team Work on functioning of Indiranagar School)

- విద్యార్థుల అభ్యసన స్థాయిలను నిరంతరం అంచనా వేయడం వల్ల విద్యార్థుల్లో చాలా వరకు మార్పు వచ్చింది.
- వెనుక బడిన విద్యార్థులకు అవసరమైన తర్ఫీదునివ్వడం వల్ల విద్యార్థులలో కనీస అభ్యసన స్థాయి 80% పెరిగింది.
- పాఠశాలకు హాజరైన విద్యార్థులు అందరూ సమయ పాలన పాటిస్తున్నారు.
- విద్యార్థులు అందరూ ప్రతి రోజు పాఠశాలకు హాజరవుతున్నారు.
- పాఠశాల నియమాలను అనుసరించడం వల్ల హాజరు శాతంలో 60% నుండి 90% కంటే ఎక్కువ పెరిగింది.
- పిల్లలకు ఇష్టమైన రంగులు, Drawing, Crafts, Music, Elocution, Mimicry, Singing etc. తర్ఫీదు పొంది జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవడం జరిగింది.
- పిల్లలలో ఆటల పట్ల ఆసక్తి పెరిగి వారికిష్టమైన క్రీడలలో ఉదా: వాలీబాల్, బేస్ బాల్, కబడ్డీ, ఖోఖో, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- సామాజిక స్పృహ పెరిగింది.సమస్యను పరిష్కరించుకోవడం, తోటి విద్యార్థులతో కలిసి పోవడం వంటి మార్పులు జరిగాయి.
- సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం అలవడింది.
- విద్యార్థుల సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి ఎంతో దోహదం చేయటం మనం చూస్తాము. కావున జట్టు నిర్మాణము వలన మాత్రమే అద్భుత ఫలితాలను సాధించగలమని చెప్పవచ్చును.

## అత్యుత్తమ జట్టుగా తీర్చిదిద్దాలంటే ఏం చేయాలి? (How to make a team the Best?)

ఉమ్మడి లక్ష్యాల సాధన కోసం కృషి చేసే ఆసక్తి అభిరుచి కలిగిన వ్యక్తుల సముదాయాన్ని జట్టుగా నిర్వచిస్తే ఇందులో ముఖ్య అంశాలను ఒకసారి పరిశీలిద్దాం.

- ఉమ్మడి లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సభ్యులందరికీ అర్థమయ్యే రీతిలో తెలియపరచగలగాలి.
- జట్టులోని సభ్యులందరికీ వారి యొక్క అభిరుచి, అనుభవం ఆధారంగా బాధ్యతలు అప్పగించటం.
- ప్రతి సభ్యుడు తన శక్తిమేరకు జట్టు విజయానికి దోహదపడుతూ కృషి చేయగలగడం.
- ప్రతి సభ్యుడు తన బాధ్యతలను నియమ నిష్ఠలతో లక్ష్యం పై దృష్టి కేంద్రీకరించి కృషి చేయడం.
- సభ్యులందరికీ కావలసిన ప్రేరణను, తోడ్పాటును తగిన స్థైర్యాన్ని జట్టు రథసారధి అందించడం.
- ప్రజాస్వామ్య పద్ధతిలో (ఒక పనిని చేపట్టే ముందు) తగిన విధంగా చర్చించి నిర్ణయం తీసుకోవడం అత్యుత్తమ పద్ధతి. ఎందుకంటే జట్టు నాయకుడే నిర్ణయం తీసుకొని సభ్యుల మీద రుద్దడం అభిలషణీయం కాదు తత్ఫలితంగా ఆశించిన లక్ష్యాల సాధన కష్టం కావచ్చు.
- జట్టు నాయకుని మీద సభ్యులకు అచంచల విశ్వాసం ఉండాలి. నమ్మకం అనేది అతి ముఖ్యమైన అంశం ఎందుకనగా నమ్మకం వలన వ్యక్తిగతమైన గౌరవం పెంపొంది జట్టు విజయానికి దోహదం చేస్తుంది.
- జట్టు సభ్యులందరూ వ్యక్తిగతమైన పక్షపాతం కలిగిన అభిప్రాయాలను వదిలిపెట్టాలి. పూర్తిగా నిర్ధారణ చేసుకోకుండా ఏ విధమైన నిశ్చితమైన అభిప్రాయానికి రాకూడదు. పరస్పరం ఒకరి మీద మరొకరు విశ్వాసాన్ని కలిగి జట్టు విజయానికి తన వంతు కృషి చేయాలి.
- జట్టు సభ్యుల యొక్క శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా వ్యక్తిగత, సామూహిక కృషిని చేయటానికి అవకాశం ఉండాలి. ఎందుకంటే పనిచేయటానికి కావలిసిన స్వేచ్ఛను ఇచ్చిన ఎడల వారు పూర్తిగా శ్రద్ధతో ఆ పనిని సొంత పనిగా భావించి ఎక్కువ ఇష్టం తో పూర్తి చేయగలుగుతారు.
- నిర్దిష్ట లక్ష్యసాధన కోసం జట్టు సభ్యులు పనిచేస్తున్నప్పుడు అవరోధాలు ఎదురుకావచ్చును. కావున జట్టు సారథి అవరోధాలను అధిగమింప చేస్తూ నిరంతరం ప్రేరణ నింపుతూ జట్టు సభ్యులను ఉత్సాహపరుస్తూ ఉండాలి.
- కీలక నిర్ణయాలు తీసుకునే విషయంలో జట్టు భాగస్వామ్యం ఉండేటట్లు చూసుకోవాలి, జట్టు అనుకున్న స్థాయికి ఎదగడానికి ప్రధానోపాధ్యాయులు జట్టును తీర్చిదిద్దాలి.

## జట్టు పని నైపుణ్యాలు (Skills in Team Work) :

ఒక జట్టు విజయవంతంగా పని చేయాలి అంటే తప్పనిసరిగా జట్టు సారధి తో పాటుగా సభ్యులందరూ ఈ నైపుణ్యాలు కలిగి ఉండాలి.

i) **వినగలగడం (Listening)** : ప్రపంచంలో అతి కష్టమైన పని ఏంటంటే ఎదుటి వారు చెప్పే విషయాన్ని వినగలగడం. చాలా మంది వ్యక్తులు సమాజంలో ఎదుటి వారు చెప్పే విషయం పూర్తి కాకుండ గానే, వినుకుండ గానే తనకున్న సమాచారం, జ్ఞానంతో ముందస్తుగా ఒక నిర్ణయానికి వస్తారు. ఇంకొందరు ఎదుటివారిని మాట్లాడనివ్వరు. ఎదుటివారు మాట్లాడుతున్నప్పుడు శ్రద్ధగా వినటం, అర్థం చేసుకోవటం ప్రతిస్పందించడం సరియైన రీతిలో చేయగలిగే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి.

ii) **ప్రశ్నలు వేయటం (Questioning)** : జట్టు సభ్యులు అనగా ఉపాధ్యాయులు ఏమైనా సందేహాలు తలెత్తినపుడు సందిగ్దస్థితి నెలకొన్నపుడు ప్రశ్నలు వేయటంలో మొహమాట పడకూడదు, భయపడకూడదు. తమకు కలిగిన సందేహాల నివృత్తికై నిర్మాణాత్మకమైన ప్రశ్నలు అడగవచ్చును మరియు సంబంధిత సభ్యులు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఎదుటివారిని కావాలని ఇబ్బంది పెట్టే ప్రశ్నలు, పాండిత్య, జ్ఞాన ప్రతాప ప్రదర్శన కోసం మాత్రం ప్రశ్నలు అడగకపోవటమే మంచిది.

iii) **ప్రోత్సహించటం (Encouraging)** : జట్టు సారధి అనగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో పాటుగా అందరూ సభ్యులు పరస్పరం ప్రోత్సహక వాతావరణాన్ని కొనసాగించటం. ఎవరూ ఎవరిని నిరుత్సాహ పరిచే మాటలను, సూటిపోటి మాటలను, ఆత్మన్యూనతకు గురిచేసే మాటలను వాడకుండుట ఎంతో మేలు.

iv) **గౌరవించుకోవటం (Respecting)**: ఉపాధ్యాయులందరూ ఒకరి ఎడల మరొకరు పరస్పర గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి. ఎట్టి పరిస్థితులలో ఇతరుల మర్యాదకు భంగం కలగకుండా ప్రవర్తించాలి.

v) **సహకరించుకోవడం (Cooperating)** : పరస్పరం ఉపాధ్యాయులందరి సహకారాన్ని ఇవ్వడం తీసుకోవడం అనేది ముఖ్యమైన నైపుణ్యం. పరస్పర సహకారం చేసుకోలేని సభ్యులున్న జట్టు విజయసాధనలో విఫలమౌతాయి.

vi) **అభిప్రాయాలను సమాచారాన్ని పంచుకోవటం (Sharing of Information and Opinions)**:

తమకు అందిన సమాచారాన్ని, తన అభిప్రాయాలకు ఇతర సభ్యులతో తరచుగా పంచుకోవటం వలన అభిప్రాయ భేదాలు రావడం జరగదు. ఎక్కడైతే గోప్యత ఉంటుందో అక్కడ అనుమానం ప్రారంభమై జట్టు వైఫల్యానికి దారి తీస్తుంది. కావున ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం పరస్పర సహకారం తో నడుచుకోవాలి.

vii) **పాల్గొనగలగడం (Participating)** : ఉపాధ్యాయులందరూ, ప్రధానోపాధ్యాయులతో పాటుగా అన్ని సామూహిక కార్యక్రమాల లో పాల్గొనాలి. జట్టులో కొందరు సభ్యులు పాల్గొనకపోతే మిగతా వారిలో నిరుత్సాహం కలిగి వారు కూడా వెనకడుగు వేసే అవకాశం ఉంది. తద్వారా వ్యతిరేక ఫలితాలు రావచ్చును. కావున అన్ని కార్యక్రమాలలో అందరూ జట్టు సభ్యులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలి.

ఇక్కడ మరొక పాఠశాలను పరిశీలిద్దాం.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంసాగర్ లో 2015 జులై నాటి పరిస్థితి

స్కూల్ గ్రౌండ్ 5 ఎకరాలు ఉన్నా చుట్టూ ప్రహరీగోడ లేదు . చాలీచాలని వసతులు, అరకొర సదుపాయాలు, పాఠశాల ఆవరణలో ఒక్క చెట్టు కూడా లేదు. పాఠశాలలో మరుగుదొడ్లు, తరగతి గదులు కావలసినవన్ని సక్రమంగా లేవు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందివ్వడం లేదు.

విద్యార్థులు బెంచ్ లు లేకపోవడం వల్ల నేలపైనే కూర్చొని తరగతులు వింటున్నారు. విద్యార్థులకు శుద్ధమైన త్రాగు నీరు లేదు. ఏదైనా సమావేశం అనగా ఆగష్టు 15, జనవరి 26 , సెప్టెంబర్ 5 లాంటి జాతీయ పండుగలు మరియు వార్షికోత్సవము జరుపుకోవడానికి డయాస్ లేదు.

ఈ కంప్యూటర్ యుగానికి అనుగుణంగా బోధించే డిజిటల్ తరగతులు లేవు . పాఠశాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేకపోవటంతో అస్తవ్యస్తంగా ఉంది . ప్రధానోపాధ్యాయులు, గ్రామ ప్రజలు మరియు స్వచ్ఛంద సంస్థలతో అనగా సత్యసాయి సేవా సమితి, లయన్స్ క్లబ్, ట్రస్టు, ఎస్.ఎం.సి. మరియు అందరి సహకారంతో సమగ్ర అభివృద్ధి దిశవైపు అడుగులు వేయడం జరిగింది. ఈ పాఠశాలను సరస్వతి నిలయంగా మరియు అందరికీ ఆదర్శంగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాము. స్వచ్ఛంద సంస్థలతో సమావేశాలు ఏర్పాటు చేసి, పాఠశాల స్థితిగతులను వారికి వివరిస్తూ 2015 లో 190 మంది విద్యార్థులు మాత్రమే ఉన్న మా పాఠశాలను ప్రస్తుతం 209 మంది విద్యార్థులతో అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాము.

**పాఠశాలలో ఉపాధ్యాయులతో జట్టు పని చేస్తూ పాఠశాలకు ఈ క్రింది సౌకర్యాలు కల్పించటం జరిగింది.**

1. గ్రామ ప్రజలు, గ్రామ సర్పంచ్ గ్రామ నాయకులు, పూర్వ విద్యార్థుల సహాయంతో చెత్త చెదారంతో కూడి ఉన్న స్థలాన్ని శుభ్రం చేయించి పాఠశాలలో పచ్చని వాతావరణం కనిపించే విధంగా మొక్కలు నాటడం జరిగింది. పెరిగిన చెట్లకు ప్రహరి గోడ లేకపోవడం వల్ల పశువుల నుండి రక్షణ కొరకు Lion Club of Gajwel Sneha వారి సహకారంతో ట్రీ గార్డ్స్ ఏర్పాటుచేయడం జరిగింది .
2. అలాగే విద్యార్థులకు లయన్స్ క్లబ్, సత్యసేవాసమితి, పూర్వ విద్యార్థులు, సహాయంతో వారికి టై, బెల్టులు, బ్యాగ్‌లు అందచేయడం, పాఠశాలలో కంప్యూటర్‌ల్యాబ్ ఏర్పర్చడం జరిగింది. అందుకు అనుగుణంగా క్రమం తప్పకుండా డిజిటల్ తరగతులు విద్యార్థులకు బోధించడం జరుగుతుంది .
3. పాఠశాలలో ఏదైనా సమావేశం లేదా కార్యక్రమం చేసుకోవడానికి డయాస్ లేకపోవడముతో గ్రామ నాయకులకు, యువతకు, SMC సభ్యుల సహకారంతో పాఠశాలలో డయాస్, Hand Wash Station ను నిర్మాణం చేయడం జరిగింది.

4. ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల కృషితో 3 సార్లు పదవ తరగతి పరీక్షలో 100% తీసుకురావటం జరిగింది. అలాగే ప్రతి సంవత్సరము టాప్ ర్యాంక్ సాధించినవారిని సన్మానించడం జరుగుతుంది. అదే విధంగా 2018 సం.లో 10 వ తరగతి విద్యార్థులు (ఇద్దరు) IIIT లో ప్రవేశం సాధించడం జరిగింది.

5. తల్లిదండ్రుల సమావేశాలు ప్రతీ నెల వారిగా ఏర్పాటు చేసి విద్యార్థుల యొక్క ప్రగతిని వారికి తెలియజేస్తూ, విద్యపై, విద్యార్థుల భవిష్యత్తుపై అవగాహన కల్పిస్తూ, పాఠశాల మంచి ఫలితాలు సాధించే దిశగా మరియు పాఠశాలపై మంచి అభిప్రాయం కలిగే విధంగా పిల్లల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసే ఆటలు, పాటలు, కవితలు, డ్రాయింగ్, వ్యాస రచనలు అమలు చేయడం జరుగుతుంది.

ఇలా అందరి చేయూతనతో, సహాయ సహకారాలతో నేడు, ఈనాడు మల్లె మొగ్గలు లాంటి విద్యార్థులు, తోటమాలి లాంటి ఉపాధ్యాయుల కృషితో ఈ పాఠశాలను ఒక చక్కని విద్యాలయంగా తీర్చిదిద్దబడినది. ఈ విజయాల వెనుక పాఠశాలాభివృద్ధికి భాగస్వాములైన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల, గ్రామ ప్రజలు, స్వచ్ఛంద సంస్థల యొక్క సంఘటిత శక్తి యొక్క పాత్ర విస్మరించడానికి వీలులేనిది. ఇలాంటి సంఘటిత శక్తి యొక్క పర్యవసానం మనకు వికారాబాద్జిల్లాలో, తాండూర్ నందున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడ ప్రస్ఫుటంగా కనబడుతుంది.

స్థానిక సమాజం, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ అందరి సమిష్టి భాగస్వామ్యంతో పాఠశాల దార్శనికతకు అద్దంపట్టేలా అభివృద్ధి సాధ్యమవుతుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయిని గారి నిర్విరామ కృషి మరియు అందరి భాగస్వామ్యంతో ప్రభుత్వం ఉన్నత పాఠశాల No. 2, ఉర్దూ మీడియం తాండూర్ వికారాబాద్ జిల్లా యందు స్పష్టమైన సకారాత్మక మార్పు తీసుకురాగలిగారు. ఎక్కువ శాతం ముస్లిం మైనారిటీ జనాభాగల ఈ ప్రాంతంలో ఉన్న ఈ పాఠశాల, అక్కడి ప్రజలు అత్యధికులు నిరక్షరాస్యులు మరియు ఆర్థికంగా వెనుకబడిన వారు కావడంచేత వారి పిల్లలను ఎక్కువగా ఉపాధి కోసం చిన్న చిన్న పనులలో ఉంచేవారు. వీరికి చదువు పట్ల పాఠశాల పట్ల ఎక్కువగా ఆసక్తి లేకుండా ఉండేది.

శ్రీమతి కె. ఆరాధన, ప్రధానోపాధ్యాయినిగా బాధ్యత స్వీకరించినప్పుడు పాఠశాల అభివృద్ధిని ఆటంకపరుస్తున్న కొన్ని అంశాలను గుర్తించడం జరిగింది. అన్ని సమస్యలపై దృష్టి సారిస్తూనే ప్రధానంగా విద్యార్థుల హాజరుపై దృష్టి కేంద్రీకరించడం జరిగింది. ఈ అంశాన్ని మూడు విభాగాలుగా గుర్తించారు.

1. పాఠశాలకు అసలు రాని విద్యార్థులు.
2. పాఠశాలకని ఇంట్లో బయలుదేరి హాజరుకాని విద్యార్థులు.
3. తరగతులు జరుగుతుండగానే మధ్యలో జారుకునే విద్యార్థులు.

ఈ విద్యార్థులు ఎక్కువగా చెరువులు కుంటలు, ఆటస్థలాలలో సమయం గడుపుతారని గ్రహించారు. వారి తల్లిదండ్రులు కూడా నిరక్షరాస్యులు కావడంచేత వారిపై పూర్తిగా పర్యవేక్షణ లేకుండాపోయింది. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయిని తల్లిదండ్రులతో వివరంగా చర్చించారు. చదువు యొక్క ఆవశ్యకత మరియు హాజరు యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ వారికి కౌన్సిలింగ్ ఇచ్చి నమ్మకాన్ని చూరగొనే ప్రయత్నం చేశారు. ఈ మేరకు మీటింగ్

నిర్వహించి పాఠశాల సిబ్బంది మరియు తల్లిదండ్రులకు తాము ముందు నిర్ధారించుకున్న లక్ష్యాలను వివరించారు. ఒక నిర్దిష్ట సమయంలో విద్యార్థులు సాధించవలసిన కనీస అభ్యసనలను వివరిస్తూ బాధ్యతలను పంచారు. వీటి సాధనలో హాజరు చాలా ముఖ్యమైనదిగా భావించి అందిరిని కార్యోన్ముఖులుగా చైతన్యపరిచారు.

పాఠశాల సిబ్బంది పిల్లలు తిరిగే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు ఇచ్చేవారు. వారు కూడా పాఠశాలకు తరచు రావాలని సూచించారు. దానివల్ల వారి యొక్క పిల్లల ప్రగతిని స్వయంగా చూడడం జరిగింది. స్వయంగా ప్రధానోపాధ్యాయుని తన ఉపాధ్యాయులతో మరియు కొంతమంది తల్లిదండ్రులతో కలిసి క్రమంగా హాజరు కాని పిల్లల ఇళ్లకు వెళ్లి వారికి తగు కౌన్సిలింగ్ ఇచ్చి మార్పుకు ప్రయత్నించారు. ప్రతి తరగతిలో హాజరు నమోదు మరియు విద్యార్థుల హాజరు వివరాలను సేకరించే బాధ్యత క్లాస్ మానిటర్‌కు అప్పజెప్పారు. ఇట్టి అనేక చర్యల ద్వారా విద్యార్థుల హాజరు గణనీయంగా పెరిగింది. దీనిని నిలుపుదల చేయడం కొరకు పిల్లలకు అసెంబ్లీ సమయంలో చిన్న చిన్న బహుమతులు ఇచ్చారు. దీంతో వారిలోపల ఒక ఆరోగ్యకరమైన మార్పు కనబడింది.

విద్యార్థులు వివిధ పరీక్షలు (FA) సకాలంలో పూర్తిచేయడంలేదని గ్రహించారు. తద్వారా మూల్యాంకనంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. దీనిని అధిగమించడానికి హాల్ టికెట్లు సర్టిఫికెట్లు ప్రవేశపెట్టారు. వీటిల్లో అన్ని పరీక్షలకు సంబంధించిన గ్రేడ్లు తదితర విషయాలను సమగ్రంగా పొందుపరిచారు. తద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతిని చక్కగా పర్యవేక్షించి సమాచారాన్ని తల్లిదండ్రులకు అందించడానికి ఉపయోగపడింది. విద్యార్థులను ఇంకా చురుగ్గా చేయడానికి పదవ తరగతిలో డైరీని ప్రవేశపెట్టారు వీటిలో రోజువారీ బోధనాంశాలు, అసైన్మెంట్లు, హోంవర్క్ తదితర వివరాలు ఉండేటట్లుగా రూపొందించారు. ప్రతిరోజు హెచ్ఎం వాటిపై సంతకంచేసేవారు దీంతో ఒక జవాబుదారీతనం పెరిగింది. అంతేకాకుండా విద్యార్థులకు గణితం మరియు సైన్స్ సులభతరం చేసేందుకు వినూత్న పద్ధతులను ఆచరణలో పెట్టారు. చర్చ, మేథోమథనం (Brain Stroming), జట్టుపని, మైండ్ మ్యాపింగ్, స్టోరీ టెల్లింగ్, అభినయం తదితర కార్యక్రమాలు నిరంతరం చేయడంవల్ల వారి యొక్క అభ్యసన స్థాయిలలో అద్భుతమైన మార్పులు వచ్చాయి. వారు తాము నేర్చుకున్న అంశాలను తిరిగి వివిధ రూపాలలో వ్యక్తపరచడానికి సంసిద్ధులు అయ్యారు.

ముఖ్యంగా మార్పులన్నీ కూడా నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. ముఖ్యంగా విద్యార్థుల ప్రవర్తన మరియు అభ్యసనలో మార్పు.
2. ఉపాధ్యాయులలో పని సంస్కృతి మరియు ఆచరణలో మార్పు.
3. తల్లిదండ్రుల్లో తమ బాధ్యతల పట్ల మార్పు.
4. పాఠశాల వాతావరణంలో మార్పు.

అందరూ గమనించదగ్గ అభివృద్ధిని సాధించడంలో పాఠశాల సఫలం కావడం ఆ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తాము సాధించినది ఒక గొప్ప విజయంగా భావిస్తారు.

ఈ విజయానికి ముఖ్య కారణాలుగా సకారాత్మక ఆలోచన, పని విభజన, ఉపాధ్యాయ మరియు సిబ్బంది యొక్క సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారం అని చెప్పవచ్చు.

సరైన ప్రణాళిక సమిష్టి బాధ్యత కృషి ఉంటే, ఎలాంటి సమస్యనైనా పరిష్కరించి విజయం సాధించగలుగుతాము.

## ఒక ప్రభావవంతమైన జట్టు లక్షణాలు (Characteristics of an Effective Team)

- జట్టు సభ్యులందరూ వారు ఈ జట్టు పనిలో పాల్గొనడం అత్యంత ఆవశ్యకంగా భావించాలి. అది వారికి మరియు జట్టుకు లాభదాయకంగా భావించాలి.
- జట్టు సభ్యులు అందరూ ఒకే ఒక్క ఎజెండా అనగా జట్టు విజయ సాధనే అంతిమ లక్ష్యంగా పని చేయాలి.
- అవసరమైన చోట ఇతర బాధ్యత కలిగిన వ్యక్తులను కూడా చేర్చుకోగలిగే వెసులుబాటు కలిగి ఉండాలి.
- జట్టు సభ్యులందరూ తగిన విధముగా సమతుల్యతతో వారి వారి నైపుణ్యాలను వినియోగించాలి.
- జట్టులో కనీసం (5) గురు సభ్యులు గరిష్టంగా (15) మంది సభ్యులు ఉండాలి.
- సభ్యులందరికీ సమస్య యెడల పూర్తి సమాచారం ఉండి తగిన విధంగా సమయానుసారంగా ప్రతిస్పందించాలి.

## జట్టు నిర్మాణ నియమాలు (Rules of Team Building)

1. జట్టు సభ్యులలో ఉన్న జడత్వాన్ని తొలగించాలి. అందరూ ఒకరుకొకరు మాట్లాడుకోవడం ద్వారా దీనిని సాధించవచ్చు.
2. ఖచ్చితమైన సమాచారాన్ని స్పష్టంగా సభ్యులు అందరికీ చేరవేయాలి.
3. జట్టు సభ్యులందరూ పరస్పర గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకోవాలి.
4. ఒకరి విలువలను మరొకరు గౌరవించాలి.
5. జట్టు సారథి పై సభ్యులకు, సభ్యులపై సారథికి పరస్పరం నమ్మకం కలిగి ఉండాలి.
6. అన్ని జట్టు కార్యాక్రమాలలో సభ్యులందరూ విధిగా పాల్గొనాలి.
7. ఆహ్లాదకర వాతావరణం ఉండాలి. ఒత్తిడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
8. ఆరోగ్య కరమైన పోటీని ప్రోత్సహించాలి.
9. ఒకరినొకరు అర్థం చేసుకొని జట్టు విజయానికి కృషి చేయాలి.

## సారాంశము:

పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు, ప్రత్యేక అధికారులు, మనం ఏ పేరుతో పిలిచినా పాఠశాల రథసారథులుగా జట్టు నిర్మాతలుగా పనిచేస్తున్నారు. వనరులు ఎంత తక్కువగా ఉన్నప్పటికి, అవరోధాలు ఎన్ని ఉన్నప్పటికినీ ఉపాధ్యాయ బృందాన్ని చక్కగా సమన్వయపరుస్తూ జట్టు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేసే విధంగా ఎలా చేయవచ్చునో ఈ మాడ్యూల్ లో చర్చించటం జరిగింది.

జట్టు అర్థం తెలుసుకోవడానికి ముందుగా సమూహం అంటే ఏమిటి అని అర్థం చేసుకోవాలి. కొందరు వ్యక్తుల గుంపును సమూహంగా భావించవచ్చు. మన సమాజంలో అనేక సమూహాలు కనిపిస్తాయి. జట్టు సమూహం రెండు పదాలు ఒకే అర్థం వచ్చేలా ఉన్నప్పటికీ మౌలికంగా రెండింటి ఉద్దేశాలు వేరువేరుగా ఉంటాయి. జట్టు మరియు సమూహంలోని సభ్యుల మధ్య పరస్పర సహకారం ఉంటుంది. సభ్యులు ఒకరినొకరు సహకరించుకుంటూ ఉంటారు. సమూహంలోని సభ్యులకు ఒక ప్రత్యేక ఉమ్మడి లక్ష్యం అనేది నిర్దేశించబడి ఉండదు. కాని జట్టులోని అందరు సభ్యులు ప్రత్యేకమైన లక్ష్యాన్ని సాధించటానికి నిరంతరం కృషి చేస్తూ ఉంటారు. ప్రతి సమూహానికి నిర్దిష్టమైన నాయకత్వం అవసరం లేదు కాని జట్టుకు మాత్రము నిర్దిష్టమైన రథసారధి ఉండాలి.

ఒక వ్యక్తి ఏమిసాధించలేకపోవచ్చు, కానీ జట్టు సభ్యులందరి సహాయ సహకారాలతో అద్భుతాలు సాధించవచ్చు. పరిమిత వనరులను ఉపయోగించుకుని తక్కువ కాలంలో లక్ష్యాలను, ఉత్తమ ఫలితాలను సాధించవచ్చును.

ఉమ్మడి లక్ష్యాల సాధన కోసం కృషి చేసే ఆసక్తి అభిరుచి కలిగిన వ్యక్తుల సముదాయాన్ని జట్టుగా నిర్వచిస్తే ఇందులో ముఖ్య అంశాలను ఒకసారి పరిశీలిద్దాం. ఉమ్మడి లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సభ్యులందరికీ అర్థమయ్యే రీతిలో తెలియపరచగలగాలి. జట్టులోని సభ్యులందరికీ వారి యొక్క అభిరుచి, అనుభవం ఆధారంగా బాధ్యతలు అప్పగించటం. ప్రతి సభ్యుడు తన శక్తిమేరకు జట్టు విజయానికి దోహదపడుతూ కృషి చేయగలగాలి.

ఒక జట్టు విజయవంతంగా పని చేయాలి అంటే తప్పనిసరిగా జట్టు సారధి తో పాటుగా సభ్యులందరూ ఈ నైపుణ్యాలు కలిగి ఉండాలి. వినగలగడం (Listening), ప్రశ్నలు వేయటం (Questioning), ప్రోత్సహించటం (Encouraging), గౌరవించుకోవటం (Respecting), సహకరించుకోవడం (Cooperating), అభిప్రాయాలను సమాచారాన్ని పంచుకోవటం (Sharing of Information and Opinions), పాల్గొనగలగడం (Participating) మొదలగునవి.

జట్టు సభ్యులలో ఉన్న జడత్వాన్ని తొలగించాలి. అందరూ మాట్లాడుకోవడం ద్వారా దీనిని సాధించవచ్చు. ఖచ్చితమైన సమాచారాన్ని స్పష్టంగా సభ్యులు అందరికీ చేరవేయాలి. జట్టు సభ్యులందరూ పరస్పర గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకోవాలి. ఒకరి విలువలను మరొకరు గౌరవించాలి. జట్టు సారథిపై సభ్యులకు, సభ్యులపై సారథికి పరస్పరం నమ్మకం కలిగి ఉండాలి. అన్ని జట్టు కార్యాక్రమాలలో సభ్యులందరూ విధిగా పాల్గొనాలి. ఆహ్లాదకర వాతావరణం ఉండాలి. ఒత్తిడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్య కరమైన పోటీని ప్రోత్సహించాలి. ఒకరినొకరు అర్థం చేసుకొని జట్టు విజయానికి కృషి చేయాలి.

పాఠశాల నిర్వహణలో విజయ సాధించాలంటే వ్యక్తులుగా విడివిడిగా చేసిన కృషి కంటే జట్టు కృషి ఎన్నో రెట్లు ప్రభావవంతంగా ఉంటుంది. విజయ సాఫల్యత రేటు జట్టు కృషి వల్లనే ఎక్కువగా ఉంటుంది. కావున ప్రధానోపాధ్యాయులు, ప్రధానాచార్యులు లేదా ప్రత్యేక అధికారులు అందరూ మీ మీ పాఠశాల నిర్వహణ లో జట్టు నిర్మాణము చేయవల్సిన అవసరం ఎంతైనా ఉంది. రథసారథి జట్టు సభ్యులు పరస్పర అవగాహనతో, పరిమిత వనరులు ఉన్నప్పటికినీ సమన్వయం తో అద్భుతాలు సృష్టించవచ్చును. కావున తామందరూ అత్యుత్తమమైన జట్టు నిర్మాతలుగా నిలిచి అనుకున్న లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయగలుగుతారు.

## మూల్యాంకనం:

1. జట్టు అంటే ఏమిటి? జట్టు నిర్మాణము వలన కలిగే ప్రయోజనాలు తెలుపండి?
2. జట్టు నిర్మాణంలో సారథి పాత్రను చర్చించండి.?
3. జట్టు నిర్మాణంలో ఉన్న దశలు ఎన్ని? అవి ఏవి?
4. ప్రభావవంతమైన జట్టు నిర్మాణం చేయాలంటే ఏ ఏ చర్యలు తీసుకోవాలి.?
5. జట్టు నిర్మాణ నియమాలు తెలుపండి?

**REFERENCES**


Adair, J. E. (2009). Effective team building: how to make a winning team. Illustrated. Pan Macmillan.

Fisher, K. (2000). Leading self-directed work teams: a guide to developing new team leadership skills.2, Illustrated, Revised: McGraw-Hill Professional.

Parker, G.M. (2003). Team Players and Teamwork: New Strategies for Developing Successful Collaboration: John Wiley and Sons.

Quick, T. L. (1992). Successful Team Building. America: AMACOM Div American Mgmt Assn.

Wellins, R., Byham, W., Wilson, J. (1991). Empowered Teams: Creating Self-Directed Work Groups That Improve Quality, Productivity, and Participation. New: Jersey: Jossey-Bass.

Wesis, D. H. (1993). Effective Team Building: The Successful office skills series. Illustrated: AMACOM.

Pattabhiram videos link

https://www.youtube.com/watch?v=MjuA4mM79Ew

https://youtu.be/MjuA4mM79Ew

Yendamuri Veerendranath video

**https://www.freegurukul.org/pdviddetails.php?id=81**